రూరల్ సర్పంచ్ అభ్యర్థి సునీతను గెలిపించుకుందాం

▸ నగర మేయర్ రమేష్ గౌడ్



అనంతపురం, నవంబర్ 18, దరువు న్యూస్ :

అనంతపురం రూరల్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా వైసీపీ మద్దతుతో పోటీ చేస్తున్న కొండేటి సునీతను గెలిపించుకుందామని నగర మేయర్ రమేష్ గౌడ్ సూచించారు. అనంతపురం రూరల్ వైసీపీ నేతలు, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు బుధవారం నిర్వహించిన సమావేశానికి నగర మేయర్ రమేష్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమిష్టిగా పనిచేసి సర్పంచ్ స్థానంతోపాటు వార్డు అభ్యర్థులను గెలిపించుకుందామని సూచించారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందించిన సంక్షేమం, అభివృద్ధి ప్రజల మదిలో ఉందన్నారు. అదే సందర్భంలో రెండున్నరేళ్లలో కూటమి ప్రభుత్వ వైఫల్యాల పట్ల ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, మొన్నటి కార్పొరేషన్, జిల్లా, మండల పరిషత్ ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు మద్దతుగా నిలబడటమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలసి ఓట్లు అభ్యర్థించాలని గెలుపే లక్ష్యంగా ముందుకు పోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై నాయకులు అభ్యర్థులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో వైసీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు ఎద్దుల అమర్‌నాథ్ రెడ్డి, నగర అధ్యక్షులు చింతా సోమశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహులు, వైసీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, కుంటిమద్ది రమేష్, హరి, మహేష్, నాగార్జునరెడ్డి, చింతకుంట మధు, బెస్త వెంకటేష్‌లు పాల్గొన్నారు.



గాలి పంట.. పిచ్చి లెక్క

- అరకొర వర్షానికే భారీగా పంట దిగుబడి
- రికార్డ్ స్థాయిలో వేరుశనగ దిగుబడి
- ఎకరానికి 15 నుండి 18 మూటలు
- వేరుశనగ ఆకు సైతం ఎకరాకు 12వేలు
- చీమలవాగుపల్లి రైతన్న కళ్ళల్లో ఆనందం



అనంతపురం, నవంబర్ 18, దరువు న్యూస్ :

దాదాపు 74 సంవత్సరాలుగా ఎన్నడూ లేని విధంగా ఎకరాకు 15 నుండి 18 మూటలు వేరుశనగ కాయలు కాశాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో వర్షాలు వచ్చినప్పటికీ ఈ దిగుబడి రాలేదని రైతులు పేర్కొంటున్నారు. ఆ గ్రామానికి చెందిన గంగిరెడ్డి అనే రైతు ఏపీఎంఎస్ ప్రతినిధితో మాట్లాడుతూ.. మా గ్రామంలో రైతులు దీనిని గాలిపంటగా అభివర్ణిస్తున్నారని ఆయన అన్నారు. 43 కేజీల వేరుశనగ కాయల బస్తా, ఏకంగా 4600 పలుకుతుండడంతో మా గ్రామ రైతుల ఆనందానికి అవధులు లేవన్నారు. వర్షాధార వేరుశనగ పంట 18 మూటలు పండడం అసాధారణం అని, వర్షాభావ పరిస్థితుల్లో ఈ దిగుబడి రావడం తనకు ఆశ్చర్యం కలిగించిందని ఆయన అన్నారు. వేరుశెనగ ఆకుకట్టే కూడా ఎకరాకు రూ.12వేలు పలుకుతున్నది. ఇది రైతులకు అదనపు ఆదాయంగా ఉంది. వేరుశనగ కట్టే పంట చేతికి వచ్చిన సమయంలో వర్షాల వల్ల కుళ్లిపోయేది. అయితే ఏమాత్రం వర్షాలు లేకపోవడంతో గొర్రెల పెంపకందారులు పెద్ద ఎత్తున గ్రామానికి వచ్చి వేరుశనగ ఆకును కొనుగోలు చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఎల్‌నినో ప్రభావకాలంలో ఈ దిగుబడి లభించడం సంతోషదాయకం.

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో పంట దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. వర్షాధార పంటలు అయితే సరేసరి.. రైతులు కనీసం వర్షాధార పంటలు వేసుకోవడానికి సైతం ఆసక్తి చూపలేదు. కొందరు రైతులు ఆసక్తి చూపిన ఏమాత్రం పంట చేతికి వచ్చిన దాఖలాలు కనపడటం లేదు. కంది, శనగ పంట అక్కడక్కడా వేసిన రైతుకు పంట చేతికి రాక దిక్కు తోచని స్థితి.

స్వర్గీయ వైయస్ రాజశేఖర్‌రెడ్డి సతీమణి విజయమ్మ స్వగ్రామం, పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లిలో అద్భుతం జరిగింది. ఆ గ్రామంలో వర్షాధార పంటగా వేరుశనగను ప్రతి ఏడాది పండించడం ఆనవాయితీ. అరకొర అదునుకే ఈఏడాది వేరుశనగ పంటను గ్రామంలో సాగు చేశారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో తమ పంటపై రైతులే ఆశలు వదులుకున్నారు. అయితే ఆ గ్రామ రైతన్న ఊహించని విధంగా పంట దిగుబడి వచ్చింది.

చందకచర్ల పంచాయతీ అభివృద్ధికి ఒక్క అవకాశం కల్పించండి

- సర్పంచ్ అభ్యర్థికి ధనుంజయ స్వామి
- ఇంటింటా ప్రచారంలో స్వామీజీ అభిమానులు శిష్యబృందం అభ్యర్థన

మడకశిర, నవంబర్ 18, దరువు న్యూస్ :

మడకశిర మండలం, చందకచర్ల గ్రామ పంచాయతీ అన్నివిధాల అభివృద్ధికి చందకచర్ల సర్పంచ్‌గా డాక్టర్ ధనుంజయ స్వామికి అన్ని గ్రామాల ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు తమవంతు బాధ్యతగా అవకాశం కల్పించాల్సిందిగా భూమానంద ఆశ్రమం పీఠాధిపతి శ్రీ ధనుంజయ స్వామి వారి అభిమానులు, శిష్య బృందం కోరారు. బుధవారం చందకచర్ల గ్రామ పంచాయతీలోని చందకచర్ల, భీమరాయనపల్లి, కొత్తలం, మరువపల్లి, ఎగువఅచ్చంపల్లి, దిగువ అచ్చంపల్లి గ్రామాలలో వారు ఇంటింటా ప్రచారంచేస్తూ, కరపత్రాలు పంచుతూ ప్రజలను అభ్యర్థించారు. అభివృద్ధిలో అన్ని విధాలుగా కుంటబడ్డ చందకచర్ల గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఈ ఎన్నికల్లో ఆశ్రమం పీఠాధిపతి, ప్రముఖ వాస్తు పండిత్, ఉచిత వాస్తు ప్రదాత, నిరుపేదలకు అన్నశీ, వస్త్ర దాత డాక్టర్ కరణం పూజార్ ధనుంజయ స్వామి వారిని ప్రతి ఒక్కరు ఆదరించి అఖండ మెజార్టీతో గెలిపించాల్సిందిగా వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డాక్టర్ ధనుంజయ స్వామి సర్పంచ్‌గా బాధ్యతలను చేపట్టిన తర్వాత చందాకచర్ల పంచాయతీ అభివృద్ధి, ప్రజలకు అందించ నున్న నాణ్యమైన సేవలను ప్రజలకు వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజల మద్దతు కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ధనుంజయ స్వామివారిని సర్పంచుగా గెలిపించాలని అభిమానులు, స్వామి శిష్య బృందం చేపట్టిన ఇంటింటా ప్రచారంనకు ప్రజల నుండి అనూహ్య స్పందన లభించడం విశేషం. ఈ కార్యక్రమంలో ధనుంజయ స్వామి అభిమానులు, శ్రేయోభిలాషులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.









సర్పంచ్‌గా ఒక్క అవకాశం కల్పించండి

- ఏకగ్రీవంగా ఎన్నుకుంటే అభివృద్ధికి తొలి విడతగా రూ.30 లక్షలు స్వచ్ఛందంగా విరాళం
- చందకచర్ల ధనుంజయ స్వామి

మడకశిర, నవంబర్ 18, దరువు న్యూస్ :

చందకచర్ల గ్రామ పంచాయతీ ప్రజల కోరిక మేరకు అన్ని రాజకీయ పార్టీలకు చెందిన పార్టీ అధ్యక్షులు నాకు సర్పంచ్‌గా ఒక్కసారి అవకాశం కల్పిస్తు ఏకగ్రీవంగా ఎన్నుకుంటే పంచాయతీ అభివృద్ధికి తన వంతు బాధ్యతగా తొలి విడతగా రూ.30 లక్షలు విరాళం అందిస్తానని చందకచర్ల సర్పంచ్ అభ్యర్థి భూమానంద ఆశ్రమ పీఠాధిపతులు డాక్టర్ చందకచర్ల ధనుంజయస్వామి స్పష్టం చేసారు. మడకశిర మండలం, చందకచర్ల పంచాయతీ, దిగువ అచ్చంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ధనుంజయ స్వామి మాట్లాడుతూ నేను జన్మించిన చందకచర్ల గ్రామ పంచాయతీ ప్రజల కోరిక మేరకు డిసెంబర్ 2న జరగనున్న సర్పంచ్ ఎన్నికల్లో చందకచర్ల సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయించుకుని బుధవారం పంచాయతీ ప్రజలతో కలసి ఎన్నికల ప్రచారంనకు శ్రీకారం చుట్టినట్లు స్వామీజీ తెలిపారు. తాను జన్మించిన స్వగ్రామం పంచాయతీ గ్రామాల ప్రజలకు అన్నివిధాలా సేవా చేయాలన్న సంకల్పంతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయాలను కుంటున్న నేపథ్యంలో మడకశిర మండలంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం పార్టీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పార్టీ అధ్యక్షులు మంచి మనసుతో, ఆలోచనతో, రాజకీయ పార్టీలకు అతీతంగా చందకచర్ల పంచాయతీ సర్పంచుగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు తమ వంతు బాధ్యతగా సహకరించాల్సిందిగా ఈ స్వామిజీ విజ్ఞప్తి చేసారు. మడకశిర పట్టణ సమీపంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ సమీపంలో భూమానంద ఆశ్రమం స్థాపించి ఆశ్రమంలో నిత్యాన్నదానం, పేదలకు వస్త్రదానం, ఉచిత వాస్తు సలహాలు అందిస్తూ సమాజ సేవలో భాగంగా ప్రజాసేవకు అంకితమైన విషయం తెల్సిందేనన్నారు. ఇదిలా ఉండగా చందకచర్ల పంచాయతీ అభివృద్ధికి ముందుకు రావాలని చేయూత నందించాలని పంచాయతీ అన్నివర్గాల ప్రజలు తమ ఆశ్రమంకు విచ్చేసి కోరడం జరిగిందన్నారు. ప్రజల కోరికను నేను కాదనలేక సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రజలకు భరోసా ఇవ్వడం జరిగిందన్నారు. కావున అన్ని రాజకీయ పార్టీలకు చెందిన పార్టీ అధ్యక్షులు, నాయకులు ఏకాభిప్రాయంతో నన్ను సర్పంచుగా ఎన్నుకునేందుకు పాటుపడాల్సిందిగా స్వామిజీ కోరారు. తాను సర్పంచుగా ఎన్నికైన మరుక్షణమే పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల అభివృద్ధికి తన వంతు బాధ్యతగా శక్తి వంచన లేకుండా, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అందరి సహకారంతో చందకచర్ల గ్రామ పంచాయతీని మండలంలోనే ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతానని ప్రముఖ వాస్తు పండిత్ డాక్టర్ ధనుంజయ స్వామి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంను ప్రారంభించిన ధనుంజయ స్వామికి ప్రజలు, మహిళలు ముఖ్యంగా యువకులు గ్రామస్తులు ఘన స్వాగతం పలుకుతూ ఎంతో ఆప్యాయతగా ఆదరించడం విశేషం. ఈ కార్యక్రమంలో స్వామీజీ అభిమానులు, శ్రేయోభిలాషులు, శిష్యులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.





నామినేషన్ల తిరస్కరణతో వైసీపీ నాయకుల హంగామా

కణేకల్, నవంబర్ 18, దరువు న్యూస్ :

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల పరిశీలన సందర్భంగా కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మండలంలోని కలేకుర్తికి చెందిన వైసీపీ సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేసిన ఇద్దరిపై టీడీపీ అభ్యర్థి ఆధారాలతో అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో సంబంధిత అధికారులు ఆ నామినేషన్లను తిరస్కరించినట్లు సమాచారం. దీంతో వైసీపీ నాయకులు జయరాంరెడ్డి, ఉషారాణి తమ మద్దతుదారులతో కలిసి కార్యాలయ ప్రధాన ద్వారం ఎదుట ఆందోళనకు దిగారు. తమ అభ్యంతరాలను వివరించేందుకు వైసీపీ తరఫున వచ్చిన ఇద్దరు న్యాయవాదులు ఎన్నికల అధికారులను సంప్రదించగా వారి వివరణకు సమాధానం చెప్పలేక అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. అనంతరం వైసీపీ నాయకులు అధికారులపై పక్షపాత ఆరోపణలు చేస్తూ, తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ విమర్శలు గుప్పించారు. అధికారులతో వాగ్వాదానికి దిగుతూ నిబంధనలకు విరుద్ధంగా కార్యాలయ ద్వారం వద్ద బైఠాయించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఈ సందర్భంగా రాయదుర్గం గ్రామీణ సీఐ వెంకటరమణ, కణేకల్ ఎస్ఐ నాగమధు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. నామినేషన్ల తిరస్కరణపై అభ్యంతరాలు ఉంటే ఉన్నత అధికారులకు చట్టబద్ధంగా అప్పీలు చేసుకోవాలని, న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచించారు. ప్రస్తుతం 30 పోలీసు చట్టం, 144 సెక్షన్ అమలులో ఉన్నందున ధర్నాలు, నిరసనలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ పోలీసుల సూచనలను పట్టించుకోకుండా వారితోనూ దురుసుగా మాట్లాడారు. ఎన్నికల నిబంధనల ప్రకారం తమ వాదనను వినిపించుకోవాల్సింది పోయి అధికారులతో వాగ్వాదానికి దిగడం, పోలీసుల సూచనలను ఖాతరు చేయక పోవడం అక్కడ చర్చనీయాంశంగా మారింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ప్రక్రియ సాగాల్సిన సమయంలో నాయకుల వ్యవహారశైలి విమర్శలకు తావిచ్చింది.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- ఆరోగ్యకరమైన జీవితాన్ని ఎంచుకోవాలి
- పీవీకేకే ఐటీ డిప్లామా కళాశాలలో అవగాహన ర్యాలీ



అనంతపురం, నవంబర్ 18, దరువు న్యూస్ :

స్థానిక రుద్రంపేటలోని పీవీకేకే ఐటి డిప్లామా కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మద్యం, పొగాకు, మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని మొదటి సంవత్సరం విద్యార్థుల తరగతి గదులను సందర్శించి, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మద్యం, పొగాకు, మాదకద్రవ్యాల అలవాట్లు ఆరోగ్యంపై చూపే దుష్ప్రభావాలతో పాటు విద్యాభ్యాసం, భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతి తరగతిలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులందరూ మద్యం, పొగాకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీ బాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ డా. పల్లె వెంకట కృష్ణ కిశోర్ మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జివిన్ఎస్ వైభవ్ నాయకత్వం వహించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సివిల్ ఇంజనీరింగ్ విభాగాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన కళాశాల కేవలం విద్యా బోధనతోపాటు, విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించడం, వారి ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయడంలోనూ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, మంచి విలువలను అలవర్చుకొని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని సూచించారు. ఈ ర్యాలీలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని మాదకద్రవ్యాల వ్యతిరేక నినాదాలు చేశారు. **'మద్యం, పొగాకు, మాదకద్రవ్యాలకు నో చెప్పండి – ఆరోగ్యకర మైన జీవితానికి స్వాగతం పలకండి.'** ఈ కార్యక్రమంలో పీవీకేకే కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపాల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలి : ఏఐఎస్‌బీ పాపిరెడ్డిపల్లి పృథ్వీ



అనంతపురం, నవంబర్ 18, దరువు న్యూస్ :

అనంతపురం నగరంలో అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృథ్వి మాట్లాడుతూ.. కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో వసంతి అనే విద్యార్థిని ఆ కళాశాల భవనం నుండి దూకి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మరణించడం తీవ్ర దిగ్భ్రాంతికరమైన విషయం అని పాపిరెడ్డిపల్లి పృథ్వి ఆవేదన వ్యక్తం చేశారు. ఒక విద్యార్థిని ప్రాణాలు కోల్పోతే కనీస మానవత్వంతో స్పందించాల్సిన కళాశాల ప్రిన్సిపాల్, ఆ విద్యార్థినికి నివాళులు అర్పించకుండా, కనీసం బాధిత కుటుంబాన్ని పరామర్శించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం అత్యంత బాధాకరం, బాధ్యతారాహిత్యానికి నిదర్శనం అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు బాధ్యత వహించాల్సిన కళాశాల యాజమాన్యం, విద్యార్థిని మరణించిన సమయంలో కనీస మానవీయ విలువలను కూడా పాటించకపోవడం సిగ్గుచేటు. విద్యార్థులు కేవలం కళాశాలకు వచ్చే సంఖ్యలు కాదు.. వారు తల్లిదండ్రుల ఆశలు, కుటుంబాల భవిష్యత్తులు. ఒక విద్యార్థిని మరణిస్తే ఆ కుటుంబం పడే వేదనను అర్థం చేసుకోలేని వారు ప్రిన్సిపాల్ బాధ్యతల్లో కొనసాగడానికి ఎలా అర్హులు అని వారు ప్రశ్నించారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ తక్షణమే స్పందించాలి. ప్రిన్సిపాల్ నిర్లక్ష్య వైఖరిపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యత నిర్ధారణ అయ్యే వరకు ఆమెను తక్షణమే సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక విద్యార్థిని ప్రాణం విలువ తెలియని ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంపై ప్రభుత్వం మౌనం వీడాలని, తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మనోజ్, ఇంతియాజ్, సురేంద్ర, మనోహర్, విజయ్‌లు పాల్గొన్నారు.

Editor, Prblished and Owned by YENUMULA KULLAYAPPA, Published for D.No. 5-76, Bhanukota, Sri Satya Sai - 515621, Printed from Jai Sriram Publications D.No. 1-3-241, Rangaswamy nagar, Ananthapuramu 515001, EDITOR : YENUMULA KULLAYAPPA Mobile : 94940 39030.